
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
గురువారం 16 జనవరి 2025





అశేష జనవాహిని నడుమ స్వామివారి రథోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు

ఆలయం నుంచి ఉత్సవ మూర్తి నీలకంఠేశ్వరుడిని రథం దగ్గరకు తీసుకువస్తున్న దృశ్యం

స్వామివారికి నైవేద్యం తీసుకొస్తున్న భక్తులు

హరహర మహాదేవ

- వైభవంగా నీలకంఠేశ్వరుడి రథోత్సవం
- జనసంద్రమైన ఎమ్మిగనూరు
- వేలాదిగా హాజరైన భక్తులు

ఎమ్మిగనూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంధ్యా వేళ.. మంగళవాయిద్యాలు.. భక్తుల శివనామస్మరణతో ఎమ్మిగనూరు పట్టణంలోని తేరుబజారు ప్రాంతం మారుమోగింది. రథవీధులు భక్త జనంతో నిండిపోయాయి. వేదపండితులు వేదమంత్రాలను వల్లిస్తుండగా ఆదిదంపతులను భక్తిశ్రద్ధలతో.. వేదమంత్రాలతో మహారథంపై కొలువుదీర్చారు. అందరి చూపు రథం కదలిక వైపే.. అందరి మదిలో భక్తిభావం.. సమయం సాయంత్రం 6:07 గంటలకు రథం ముందుకు సాగింది. ఒక్కసారిగా హరోం.. హర.. శంభోశంకరా.. జయహో నీలకంఠేశ్వరా.. అంటూ నినదించారు. రథ చక్రాలు మార్కండేయుడి గుడివైపు 6:15 గంటలకు మార్కండేయుడి సన్నిధానానికి రథం చేరింది. అక్కడ పూజలు చేసి 6:33 గంటలకు రథం యథాస్థానానికి చేరడంతో రథోత్సవం ముగిసింది. మహారథంపై ఆదిదంపతుల ఊరేగింపు కళ్లారా చూసి పులకించాలని, భక్తితో తరించాలని భక్తులు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మిగనూరు ప్రజల ఆరాధ్యదైవం నీలకంఠేశ్వరస్వామి మహారథోత్సవం ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. ఉదయం నుంచే ఆలయ నిర్వాహకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ధర్మకర్త ఎద్దులింటి మాచాని నీల మురళీధర్ ఆధ్వర్యంలో ఆలయం నుంచి ఉత్సవమూర్తులను పల్లకిలో రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అలాగే మేళతాళాలతో గడిగే నాగప్ప కుటుంబీకులు కుంభం తీసుకొచ్చారు. రథం ముందు వేదపండితులు హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణవాసులు, చుట్టుముట్టుగ్రామాల ప్రజలు, భక్తులు తేరుబజారు ప్రాంతానికి చేరుకున్నారు. రథోత్సవం సమయంలో ఏ ప్రమాదం జరుగకుండా ముందుగానే రథవీధులను ట్రాక్టర్లతో దున్ని నీళ్లుపోసి సిద్ధం చేశారు. ప్రధానంగా రథంపై కలశాన్ని చూసేందుకు నవదంపతులు తరలివచ్చారు. స్వామివారిని ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, తదితర ముఖ్య నాయకులు దర్శించుకున్నారు.



రథం ఎదుట హోమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

పైసల 'ప్లానింగ్'



- ప్లానింగ్ సెక్రటరీల హవా
- పెరిగిపోతున్న అక్రమ కట్టడాలు
- ఉపాధి కోల్పోతామంటున్న ఎల్‌టీపీలు

ఆదోని టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్లానింగ్ సెక్రటరీల హవాతో ఎల్‌టీపీలు ఉపాధి కోల్పోతున్నారు. ప్లానింగ్ సెక్రటరీలు ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్లాన్ల మంజూరులోనూ తలదూర్చుతున్నారు. ఎల్‌టీపీలు చేయాల్సిన పనిని వారే లాగేసుకొని అదనపు ఆదాయం కోసం ఆరాటపడుతున్నారు. ఫలితంగా ఉద్యోగ అవకాశాల్లేక ఎల్‌టీపీలుగా నమోదు చేసుకున్న వారు మాత్రం పని లేక ఉసూరుమంటున్నారు. పట్టణ పరిధిలోని భవన నిర్మాణాలకు సంబంధించి అవసరమైన ప్లానులు మంజూరు విషయంలో కొందరు సచివాలయ ఉద్యోగులుగా ఉంటూ మరో వైపు ప్రైవేటు ప్లానర్లుగా కొనసాగుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఎల్‌టీపీలు ఉపాధిని కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఎవరైనా భవన నిర్మాణం చేసుకోవడానికి ఎల్‌టీపీలతో ప్లాన్ వేయించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించాల్సి ఉంటుంది. అందుకు సంబంధించి ఫీజులు చెల్లిస్తే ఆ సమాచారం ఆ వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శికి చేరుతుంది. అతను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అన్ని సరిగ్గా ఉన్నట్టు నిర్ధారిస్తే పై అధికారి టీపీవో ప్లాన్ మంజూరు చేస్తారు. అయితే ప్లాన్ మంజూరు తమ చేతిలో ఉండడంతో కొందరు ప్లానింగ్ కార్యదర్శులు ఇదే అదునుగా భావించి తమ చేతివాటానికి తెరలేపారు. ప్లాన్ కూడా తామే వేసి వెంటనే మంజూరు చేస్తామని యజమానులతో లోపాయికారిగా మాట్లాడుకొని మొత్తం కాంట్రాక్టు తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇతర ప్రాంతాలకు చెందిన (కర్నూలు, నంద్యాల, ఆళ్లగడ్డ) ఎల్‌టీపీల లాగిన్‌లలో ప్లానింగ్ కార్యదర్శి వేసిన పాన్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి తిరిగి వారే ప్లాన్ మంజూరుకు పూనుకుంటుండడంతో రెండువైపులా వారికి ఆదాయం లభిస్తోంది. ఒక్కో ప్లానుకు వాటి వైశాల్యం, అంతస్థులను బట్టి రూ.50 వేల నుంచి బహుళ అంతస్థుల భవనాలకు రూ.4 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆదోనిలో జరిగే నిర్మాణాలకు సంబంధించిన ప్లానులు, ఈ ప్రాంతంతో పరిచయం లేని ఇతర ప్రాంతాల్లోని ఎల్‌టీపీల లాగిన్‌లలో ఎలా అప్‌లోడ్ అవుతున్నాయన్న ప్రశ్నకు సమాధానం చెప్పేవారు లేరు.



ప్రధాన రహదారిలో పార్కింగ్ లేకుండా నిర్మిస్తున్న కమర్షియల్ బిల్డింగ్

● అక్రమ కట్టడాల హవా

సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి ఎల్‌టీపీల అవతారమెత్తి నిర్మాణదారులతో హోల్‌సేల్ లాగా కాంట్రాక్టు మాట్లాడుకుని ప్లాన్లను మంజూరు చేస్తుండడంతో పట్టణంలో జరుగుతున్న అక్రమ కట్టడాలను నిరోధించే వారు లేకుండా పోయారు. మెయిన్ రోడ్డులో రిక్రియేషన్ క్లబ్ ఎదురుగా ఒక మూడంతస్థుల కమర్షియల్ బిల్డింగ్ పార్కింగ్ స్థలం వదలకుండా నిర్మాణం జరుగుతోంది. ఎమ్మిగనూరు రోడ్డులో మరో మూడంతస్థుల కమర్షియల్ బిల్డింగ్ నిర్మాణం జరుగుతున్నా అధికారులు ఎందుకు మిన్నకుండిపోయారో వారికే తెలియాలి. మాస్టర్‌ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణ జరగాల్సిన స్థలంలో నిర్మాణా లు జరుగుతున్నా.. పార్కింగ్ లేకుండా కమర్షియల్ కాంప్లెక్స్‌ల పనులు చేపడుతున్నా, సచివాలయం సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తూతూమంత్రంగా నోటీసులు ఇస్తూ మిన్నకుండిపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్లానింగ్ సెక్రటరీల ద్విపాత్రాభినయంతో పట్టణంలో 20 నుంచి 40 సంవత్సరాలుగా ప్లానర్లుగా ఉపాధి పొందుతున్న ఎల్‌టీపీలు ఉపాధిని కోల్పోతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ప్లానింగ్ సెక్రటరీలపై కఠినంగా వ్యవహరిస్తాం. ప్లాన్ వేసిన ఎల్‌టీపీ స్వయంగా వచ్చి సైట్ ఇన్స్పెక్షన్ చేయించాలన్న నిబంధన పెట్టి ఎల్‌టీపీలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

- బాల మద్దయ్య, టీపీవో




నిబంధనలను తుంగలో తొక్కి..

పాలిటెక్నిక్, బీటెక్ సివిల్ చదివిన వారు ఉద్యోగ అవకాశాల్లేక మున్సిపాలిటీల్లో అనుమతి తీసుకొని ఎల్‌టీపీలుగా (లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్‌గా) నమోదు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. వీరు పట్టణంలో ఎవరికైనా భవన నిర్మాణాలకు సంబంధించి ప్లాన్లు వేసి మంజూరు కోసం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. వీటిని టీపీవో పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారు. అయితే ఇందుకు విరుద్ధంగా ప్లానింగ్ సెక్రటరీలు వ్యవహరిస్తున్నారు. ఎల్‌టీపీలు చేయాల్సిన పనిని వీరే చేసేస్తున్నారు. ప్లాన్ సెక్రటరీలే ప్లాన్‌లు వేసి టీపీవోకు పంపిస్తున్నారు. ఇందుకోసం భవన యజమానుల నుంచి భారీగా వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి జీతం తీసుకోవడంతో పాటు అందనంగా ప్లాన్లు ఇస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఎలాంటి ఉపాధి లేక ఎల్‌టీపీలుగా పని చేస్తున్న వారు మాత్రం పని లేక ఉసూరుమంటున్నారు.

రావణ వాహనంపై దేవదేవుడు

శ్రీశైలంలో కనుల పండువగా లీలా కల్యాణోత్సవం



రావణవాహన సేవపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు

శ్రీశైలం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఐదో రోజు ఘనంగా నిర్వహించారు. బుధవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు రావణవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రావణవాహనంపై ఆశీనులను చేసి క్షేత్ర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఎం శ్రీనివాసరావు, ఉభయ దేవాలయాల అర్చకులు పాల్గొన్నారు.

● ఉత్సవాల్లో భాగంగా నాల్గవరోజు మంగళవారం సంక్రాంతి పర్వదినం రోజున సాయంత్రం స్వామి, అమ్మవార్లు నందివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు లీలా కల్యాణత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణోత్సవానికి చెంచు భక్తులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. వారికి నూతన వస్త్రాలను, వెదురు బియ్యం సమర్పించారు.

శాస్త్రోక్తంగా గో పూజ : కనుమ పురస్కరించుకొని గో పూజా మహోత్సవాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించింది. నిత్య గో సేవతో పాటు ఆవులకు, దూడలకు పూజలు జరిపారు.

నేడు యాగ పూర్ణాహుతి, ధ్వజావరోహణ : ఉత్సవాల్లో భాగంగా గురువారం యాగ పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూల స్నానం, సాయంత్రం ధ్వజపటాన్ని అవరోహణ చేస్తారు.

బాల సాయిబాబా సేవలు చిరస్మరణీయం

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు

కర్నూలు కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భగవాన్ బాలసాయిబాబా పేద ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. మంగళవారం పాత నగరంలోని శ్రీనిలయంలో జరిగిన భగవాన్ బాలసాయి జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాల సాయి మందిరంలో ఆయనకు నివాళులర్పించి అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ బాల సాయి బాబా మన మధ్య లేకపోయినప్పటికీ ఆయన చేసిన సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. తనకు బాల సాయిబాబాతో 40 ఏళ్ల అనుబంధం ఉందని అన్నారు. సేవా కార్యక్రమాలు కోసం బాలసాయిబాబా ఎవ్వరి దగ్గరా విరాళాలు సేకరించలేదని, విదేశాల నుంచి వచ్చిన నిధులను ఇక్కడి వారిని సేవకు వినియోగించేవారని అన్నారు. బాలసాయిబాబా మొదలు పెట్టిన కార్యక్రమాలను ట్రస్టు ఆధ్వర్యంలో నిరంతరాయంగా కొనసాగిస్తున్న మేనేజింగ్ ట్రస్టీ టి. రామారావు అభినందనీయుడు అన్నారు. బాలసాయి జయంతి సందర్భంగా పేద ప్రజలకు తోపుడు బండ్లు, కుట్టుమిషన్లు, ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, మాజీ ఎమ్మెల్యే మదనగోపాల్, బాలసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ టి. రామారావు తదితరులు పాల్గొన్నారు.





హాజరైన విదేశీయులు, బాలసాయిబాబా భక్తులు

వైభవం.. పార్వేట ఉత్సవం

- అహోబిలంలో కన్నుల పండువగా ఉత్సవం
- కొండ దిగొచ్చిన జ్వాలా నృసింహుడు
- దిగువ అహోబిలంలో అన్న కూటోత్సవం, కుంభ హారతి
- ఉత్సవ పల్లకిని సాగనంపిన చెంచులు



పార్వేట పల్లకిలో కొలువైన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 15(ఆంధ్రజ్యోతి): వేలాదిమంది భక్తుల నారసింహుని నామస్మరణతో అహోబిలం ప్రతిధ్వనించింది. పల్లకిపై కొలువుదీరిన అహోబిలేశుని దర్శనంతో భక్తజనం మైమరచి పోయింది సంక్రాంతి తర్వాత కనుమ రోజు ఆనవాయితీగా నిర్వహించే నృసింహుని పార్వేట ఉత్సవం బుధవారం వైభవంగా సాగింది. సకల దేవతలు హాజరయ్యే తమ కల్యాణోత్సవానికి భక్తులంతా తరలి రావాలని ఆహ్వానించేందుకు సాక్ష్యాత్తు అహోబిలేశుడు గ్రామాలకు పయనమయ్యాడు. ఎగువ అహోబిలంలోని జ్వాలా నరసింహ స్వామి మకర సంక్రాతి పర్వదినాన దిగువ అహోబిలం చేరుకున్నాడు. చెంచు మహిళలు విల్లంబులతో స్వామివారి పల్లకి వెంట సంప్రదాయ నృత్యం చేశారు. కొండదిగిన జ్వాలా నరసింహస్వామికి అహోబిలం మఠం స్థాపనాచార్యులు ఆదివన్ శఠగోప యతీంద్ర మహాదేశికన్ మూర్తిస్వరూపుడు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తాంబూలం సమర్పించి సమస్త రాజోపచారములచే దిగువ అహోబిలానికి తీసుకువచ్చి విశేష పూజలు నిర్వహించారు.

భక్తుల చెంతకు పయనమైన దేవదేవుడు

వేదపండితుల మంత్రోచ్చరణాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య 45 రోజుల పాటు 32 గ్రామాల్లో భక్తులకు దర్శనభాగ్యం కలిగించేందుకు దేవదేవుడు పయనమయ్యాడు. దిగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించి శాస్త్రోక్తంగా అన్నకూటోత్సవం నిర్వహించారు. స్వామివార్లకు నివేదించిన అన్నాన్ని చెంచులు, గుడికట్టు, ఆయకట్టు, కర్ణం, రెడ్డి, బోయిలకు పంచిపెట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, వేద పండితులు కుంభహారతి నిర్వహించారు. అనంతరం జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పార్వేట పల్లకిలో కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. అశేష భక్తజన సందోహం మధ్య స్వామి వారి పార్వేట పల్లకి దిగువ అహోబిలం నుంచి బయలుదేరుతుండగా చెంచులు విల్లంభులు సంధిస్తూ.. మహిళలు సంప్రదాయ నృత్యం చేస్తూ పార్వేట పల్లకిని సాగనంపారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణన్, ఆలయ మేనేజర్ మురళీధరన్, సీఏవో రామ మోహన్, వేద పండితుల ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, ఆళ్లగడ్డ డీఎస్పీ రవి కుమార్, రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి సబ్ డివిజన్‌లోని పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. శ్రీవారికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పట్టువస్త్రాలు సమర్పించారు. పార్వేట పల్లకిలో కొలువైన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులకు ఎమ్మెల్యే విశేష పూజలు నిర్వహించారు.



నృత్యం చేస్తున్న మహిళలు



పార్వేటకు బయలుదేరిన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామి ఉత్సవ పల్లకి

మార్కెటింగ్ శాఖలో త్వరలో పదోన్నతులు



కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయం

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 15 మార్కెట్ కమిటీ యార్డులో అధికారులు, సిబ్బందికి త్వరలోనే పదోన్నతులు లభిస్తాయని అధికారులు తెలిపారు. కర్నూలు మార్కెట్ కమిటీలో అసిస్టెంట్ సెక్రటరీలుగా పని చేస్తున్న వెంకటేశ్వర్లు, రెహిమాన్‌లకు గ్రేడ్-3 సెక్రటరీలుగా పదోన్నతి లభించనుంది. సూపర్‌వైజర్లుగా పని చేస్తున్న కేశవరెడ్డితో పాటు శివన్న, నాగేష్‌లకు అసిస్టెంట్ సెక్రటరీలుగా పదోన్నతి లభించనుంది. కోడుమూరు మార్కెట్ కమిటీలో అసిస్టెంట్ సెక్రటరీగా పని చేస్తున్న సెక్రటరీ సుందర్‌రాజుకు గ్రేడ్-2 సెక్రటరీగా, అక్కడే పని చేస్తున్న సూపర్‌వైజర్ శ్రీనుకు అసిస్టెంట్ సెక్రటరీగా పదోన్నతి లభించనుంది. వీరంతా తమకు అనుకూలమైన మార్కెట్ కమిటీల్లో పోస్టింగుల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

● త్వరలోనే పదోన్నతులు!

కర్నూలు జిల్లాలో వివిధ మార్కెట్ యార్డులో పని చేస్తున్న సెక్రటరీలు, సూపర్‌వైజర్లకు త్వరలోనే పదోన్నతులు లభించనున్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత ఈ ప్రక్రియ చేపడతారు.

- ఏడీఎం నారాయణ మూర్తి

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి 6వ తరగతిలో 80 సీట్లకు గాను మొత్తం 6035 విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈనెల 18వ తేదీ శనివారం ఉదయం 11.30 గంటల నుండి 1.30 గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుందన్నారు. కర్నూలులో 13 కేంద్రాలు, నంద్యాలలో 9 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు రిజిస్ట్రేషన్ నెంబర్, పాస్‌వర్డ్‌గా పుట్టిన తేదీని ఉపయోగించి ఆన్‌లైన్ ద్వారా అడ్మిట్ కార్డును పొందాలన్నారు. రిజిస్ట్రేషన్ నెంబర్ మరచిపోయిన అభ్యర్థులు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయ హెల్ప్-లైన్ నంబర్ సహకారంతో రిజిస్ట్రేషన్ నెంబర్‌ను తెలుసుకోవచ్చని తెలిపారు. ఈనెల 16వ తేదీన కర్నూలులోని మాంటిస్సోరి (ఏ-క్యాంపు) స్కూలులో జిల్లా విద్యాధికారుల పర్యవేక్షణలో పరీక్ష నిర్వాహణ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే 085212-29454, 9652350633, 9985738899లకు సంప్రదించాలన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

- ప్రేమ విఫలం కావడంతో...
- ఉమ్మాయిపల్లెలో విషాదం



శివరాఘవరెడ్డి(ఫైల్)

కొలిమిగుండ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించిన యువతి తనకు దక్కలేదన్న ఆవేదనతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన కొలిమిగుండ్ల మండలం ఉమ్మాయిపల్లె గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన అంబటి రామచంద్రారెడ్డి, గంగ శివమ్మలకు కొడుకు, కూతురు ఉన్నారు. వ్యవసాయ పనులు చేసుకొని జీవనం సాగించే ఆ దంపతులు కష్టపడి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. ఇటీవలే బీటెక్ పూర్తి చేసుకున్న కొడుకు శివరాఘవరెడ్డి(25) బెంగుళూరులో ఐదు నెలల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాడు. దీంతో తమ కష్టాలు గట్టెక్కుతాయని భావించిన తల్లిదండ్రులకు కొడుకు ఆత్మహత్య చేసుకొని తీరని వ్యథ మిగిల్చింది. మూడు రోజుల క్రితం పండుగకు ఇంటికి వస్తున్నానమ్మా.. అంటూ తల్లికి ఫోన్ చేసి చెప్పిన కొడుకు తన స్నేహితులతో కలిసి ఈనెల 13న బెంగుళూరు నుండి ట్రైన్‌లో ధర్మవరం చేరుకున్నాడు. అక్కడి నుండి ఇంటికి రావాల్సిన రాఘవరెడ్డి ధర్మవరంలో లాడ్జి తీసుకొని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ విఫలం కావడమే కారణమని తెలుస్తోంది. మంగళవారం వెలుగు చూసిన ఈ ఘటన ఉమ్మాయిపల్లె గ్రామంలో తీవ్ర విషాదం నింపింది. బుధవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మంత్రి ఇంటిపై డ్రోన్ కలకలం

బనగానపల్లె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో బుధవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఇంటిపై డ్రోన్ ఎగరడంతో కలకలం రేగింది. వైసీపీకి చెందిన అబ్దుల్‌ఫైజ్ కుమారుడి వివాహం సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఇంటిపై డ్రోన్ ఎగరడంతో టీడీపీకి చెందిన ఇరువురు వ్యక్తులు ఫైజ్‌కు చెందిన ఇరువురు కెమెరా మెన్లపై దాడి చేసినట్లు ఫిర్యాదు తమకు అందినట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అబ్దుల్‌ఫైజ్ తమ అనుచరులతో వచ్చి బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌లో తమ డ్రోన్ కెమెరా మెన్‌లపై టీడీపీ వ్యక్తులు దాడి చేశారని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఫిర్యాదును స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ఎస్పీ, డీఎస్పీ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పండుగ పూట విషాదం

- వెల్దుర్తిలో కారు ఢీకొని బాలుడి మృతి
- గాలిపటం ఎగురవేయడానికి హైవేకి వెళ్లి వస్తుండగా ఘటన



గిరిచరణ్ (ఫైల్)

వెల్దుర్తి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి పట్టణం సమీపంలోని ఎన్‌హెచ్-44 రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన గిరిచరణ్ (10) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలివీ.. పట్టణంలోని ఇంద్రానగర్ చెందిన బోయ వెంకటేశ్వర్లు, కళ్యాణి దంపతులు మూడో కుమారుడు గిరిచరణ్ వెల్దుర్తి పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో హైవే సమీపంలో తన పెదనాన్న నిర్వహిస్తున్న వాటర్ సర్వీసింగ్ సెంటరు వద్ద బుధవారం ఉదయం తోటి స్నేహితులతో గాలిపతంగులు ఎగురవేసేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో హైవే దాటుతుండగా.. కర్నూలు నుంచి డోన్ వైపు వెళ్తున్న ఓ కారు ఆ బాలుడుని ఢీకొట్టింది. దీంతో ఎగిరిపడ్డ గిరిచరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం చెందిన తమిళనాడు హోసూరు చెందిన కారుగా గుర్తించామని, కారు డ్రైవరు దేవేంద్రన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ అశోక్ కుమార్ తెలిపారు.

అగ్ని ప్రమాదానికి గురైన ప్రైవేట్ ట్రావెల్ బస్సు

- చాపిరేవుల టోల్ ప్లాజా వద్ద ఘటన
- బస్సులో సుమారు 45మంది ప్రయాణికులు
- టోల్‌ప్లాజా సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ముప్పు



ప్రమాదానికి గురైన ప్రైవేట్ ట్రావెల్ బస్సు

నంద్యాల క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సమీపంలోని చాపిరేవుల టోల్ ప్లాజా వద్ద మంగళవారం తెల్లవారుజామున సుమారు 4.40 గంటల సమయంలో ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. అరుణాచలం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఎన్ఎస్‌కె ప్రైవేట్ ట్రావెల్ బస్సు నంద్యాల సమీపంలోని చాపిరేవుల గ్రామం వద్ద ఉన్న టోల్ ప్లాజావద్దకు రాగానే మంటలు వ్యాపించాయి. టోల్‌ప్లాజా సిబ్బంది గమనించి డ్రైవర్, ప్రయాణికులను అప్రమత్తం చేయడంతో అందరూ వెంటనే బస్సు దిగారు. టోల్ ప్లాజా సిబ్బంది తమ వద్ద ఉన్న అగ్నిప్రమాద నివారణ యంత్రాలతో ప్రమాదాన్ని అరికట్టేందుకు యత్నించినా సాధ్యం కాలేదు. వెంటనే వారు సమాచారాన్ని నంద్యాల అగ్నిమాపక సిబ్బందికి చేరవేశారు. వారు వచ్చి బస్సు అద్దాలను పగులగొట్టి మంటలను ఆర్పివేశారు. ఈ సందర్భంగా అగ్నిమాపక దళ సిబ్బంది మాట్లాడుతూ బస్సు నిర్విరామంగా ప్రయాణం చేయడంవల్ల బస్సు టైర్ల దగ్గర ఉండే వీల్స్ తీవ్ర రాపిడికి గురై వేడితో మంటలు వ్యాపించాయన్నారు. సకాలంలో టోల్‌ప్లాజా సిబ్బంది అప్రమత్తమై తమకు సమాచారం అందించడంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదన్నారు. ఈ బస్సులో సుమారు 45మంది ప్రయాణికులు ఉన్నట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రమాదంలో బస్సు లోపలి భాగంలో కూడా పాక్షిక నష్టం వాటిల్లింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

● నంద్యాల, నందికొట్కూరులో ఘటనలు

నంద్యాల క్రైం/నందికొట్కూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల, నందికొట్కూరులో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. నంద్యాల పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. శిరివెళ్లకు చెందిన అత్తార్ అస్లాం(26), తిమ్మాపురం గ్రామానికి చెందిన కాకాని కళ్యాణ్ ఇద్దరూ బైకుపై పట్టణంలోని సంజీవనగర్ నుంచి శ్రీనివాస సెంటర్‌కు వస్తుండగా మార్గమధ్యంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అస్లాం మృతి చెందాడు. గాయపడిన కళ్యాణ్‌ను పోలీసులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నందికొట్కూరులో..

పట్టణంలో రెండు ద్విచక్రహనాలు ఢీకొనడంతో అక్కడికక్కడే ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం సాయంత్రం పాతకోట గ్రామానికి చెందిన తేజేశ్వరుడు, హరి ద్విచక్ర వాహనంపై బయలుదేరగా.. నందికొట్కూరు ఏబీఎన్ పాలెం చెందిన రాజు ఓ బైకు ప్రాతకోటకు వెళ్తుండగా మార్గం మధ్యలో పగిడ్యాల రోడ్డు రైస్‌మిల్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ప్రాతకొటకు చెందిన తేజేశ్వరుడు అక్కడికి అక్కడే మృతి చెందగా హరి గాయపడ్డారు. రాజు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం హరిని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు, రాజును కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. తమ దృష్టికి వచ్చిందని, అయితే ఇంకా ఫిర్యాదు అందలేదని సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి

- ముగ్గుల పోటీల నిర్వహణ అభినందనీయం
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. డీవీఆర్, టీజీవీ గ్రూప్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బుధవారం రాత్రి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ముగ్గుల పోటల్లో ప్రతిభ ఆధారంగా విజేతలను ఎంపిక చేశారన్నారు. సంప్రదాయాన్ని గుర్తు చేసేలా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లాకు రూ.14వేల కోట్ల పెట్టుబడులతో సెమికండక్టర్ పరిశ్రమను ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో జిల్లాకు మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. సరైన సమయంలో రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని, ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల వ్యవధిలోనే లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు కృషి చేశామని చెప్పారు. ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ముందుకెళ్తున్నామన్నారు. 2025 సంవత్సరం కూడా ప్రజలందరికీ ఎంతో మంచి జరుగుతుందని ఆకాంక్షించారు. డీవీఆర్ గ్రూప్స్ చైర్మన్ డి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పోటీలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు, కన్సోలేషన్ బహుమతులను మంత్రి టీజీ భరత్, డీవీఆర్ గ్రూప్స్ చైర్మన్ డి.వెంకటేశ్వరరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ ఫేమ్, యాంకర్ రష్మిగౌతమి, యాంకర్ దీప్తి నల్లమోతు హాజరయ్యారు. జబర్దస్త్ కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పోలీసు అధికారినని డబ్బు కాజేసిన సైబర్ నేరగాడు

- అరెస్టు చేయకూడదంటే డబ్బులు చెల్లించాలి
- మనీ లాండరింగ్ కేసు ఉందని రూ.32.5 లక్షలు దగా

శిరివెళ్ల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): 'నేను పోలీసు అధికారిని మాట్లాడుతున్నా.. 18 మనీ లాండరింగ్ కేసుల్లో నీ పాత్ర ఉంది.. అరెస్టు చేయకూడదంటే డబ్బులు చెల్లించాలి' అని చెప్పి విడతల వారీగా యువకుడి నుంచి రూ.32.5 లక్షలు కాజేశాడు ఓ సైబర్ మోసగాడు. ఈ ఘటన శిరివెళ్లలో జరిగింది. శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాలివీ.. శిరివెళ్లకు చెందిన నంద కిశోర్ అనే యవకుడికి కొన్ని నెలల క్రితం ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. మనీ లాండరింగ్ కేసుల్లో ఇన్వాల్వ్ అయ్యావని.. కేసుల్లో నుంచి బయటపడేందుకు, అరెస్టు చేయకుండా ఉండేందుకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీంతో సైబర్ మోసగాడి మాటలకు భయభ్రాంతులకు గురైన బాధితుడు నంద కిశోర్ నిందితుడు ఇచ్చిన పలు బ్యాంకు అకౌంట్లలో విడతల వారీగా రూ.32,50,600 జమ చేశాడు. అనంతరం ఇంకా డబ్బులు ఇవ్వాలని సైబర్ మోసగాడు బెదిరింపులకు పాల్పడుతుండడంతో బాధితుడు నంద కిశోర్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రథోత్సవంలో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో భక్తుడి మృతి

ఆదోని రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం దిబ్బనకల్లులో విషాదం చోటు చేసుకొంది. రథోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తుడు కురువ వీరేష్(41) విద్యుదాఘాతంతో మృతి చెందారు. వివరాలివీ.. గ్రామానికి చెందిన వీరేష్‌కు 20 సంవత్సరాల క్రితం పెద్దకడబూరు మండలం రంగాపురం గ్రామానికి చెందిన లక్ష్మీతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు అబ్బాయిలు, ఆడపిల్ల ఉన్నారు. మంగళవారం రాత్రి గ్రామంలో అఖండప్పతాత రథోత్సవ సమయంలో దేవాలయ పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ బల్బుల తీగలు తగిలి అక్కడిక్కడే కుప్పకూలారు. హుటాహుటిన గ్రామస్థులు చికిత్స నిమిత్తం ఆదోని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. వీరేష్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

సెక్యూరిటీ గార్డుల రోల్ కాల్ పరిశీలన


రోల్ కాల్‌ను పరిశీలిస్తున్న హెల్త్ ఇన్‌స్పెక్టర్లు

కర్నూలు హస్పిటల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధికారుల ఆదేశాల మేరకు హెల్త్ ఇన్‌స్పెక్టర్లు సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు రోల్‌కాల్‌ను పరిశీలించారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణమూర్తి, గోవిందస్వామి, రోల్‌కాల్ దగ్గరకు వెళ్లి వివరాలు సేకరించారు. ఉదయం ఏ-షిఫ్టులో 96 మంది ఉండాల్సి ఉండగా.. 63 మంది, మధ్యాహ్నం బి-షిఫ్టులో 46 మందిలో 24 మంది హాజరైనట్లు గుర్తించారు. మెయిన్‌గేటు దగ్గర ఇతర వ్యక్తుల ప్రవేశాన్ని ఆటోలను నియంత్రించాలని అధికారులను ఆదేశించారు.

సీనియర్ కార్డియాలజిస్టు రామకృష్ణారెడ్డి మృతి


రామకృష్ణారెడ్డి (ఫైల్ ఫొటో)

కర్నూలు హస్పిటల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ రిటైర్డు ప్రిన్సిపాల్, సీనియర్ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ టి. రామకృష్ణారెడ్డి (84) కార్డియో రెస్పిరేటరీ ఫెల్యూరుతో బాధపడుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. నగరంలోని డాక్టర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు నలు గురు సంతానం. పెద్ద కుమారుడు హరికృష్ణ రెడ్డి అమెరికాలో సాఫ్ట్‌వేర్‌గా, చిన్న కుమారుడు డాక్టర్ విజయకృష్ణారెడ్డి ఆర్థో సర్జన్, కేఎంసీ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి కర్నూలు జీజీహెచ్‌లో 22 ఏళ్ల కార్డియాలజీ విభాగానికి చీఫ్‌గా వ్యవహరించారు. ఈ సమయంలో ఆయన కార్డియాలజీ, ఐసీయును స్థాపించారు. అనంతరం రిటైర్డు అయి విజయ హాస్పిటల్‌ను స్థాపించారు. రామకృష్ణారెడ్డి మృతి పట్ల ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రామచంద్ర నాయుడు, డాక్టర్ ఎస్వీ రామ్మోహన్ రెడ్డి, అప్సా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, ఏపీజీడీఏ నాయకులు, వైద్యులు తీవ్ర సంతాపం తెలిపారు.

డాకు మహారాజు విజయోత్సవ సంబరాలు


సోమిశెట్టికి కేక్ తినిపిస్తున్న బాలకృష్ణ అభిమానులు

కర్నూలు అర్బన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేష్ సినిమా థియేటర్‌లో బుధవారం డాకు మహారాజు విజయోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు హాజరై అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాకు మహారాజు సినిమాతో సమాజానికి నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ మంచి సందేశం ఇచ్చారని అన్నారు. తన తండ్రి నందమూరి ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ సమాజ కోసం నిరంతరం శ్రమిస్తున్న కుటుంబానికి ప్రజల మద్దతు ఎప్పు డు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సుధాకర్ నాయుడు, శంకర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, తెలుగు యువత ఉపాధ్యక్షుడు సోమిశెట్టి నవీన్, పేరపోగు రాజు, బాలక్రిష్ణ అభిమానులు పాల్గొన్నారు.

ధర్మవ్యాధుని ఆశయాలను నేరవేరుద్దాం


నివాళి అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

కర్నూలు అర్బన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ధర్మవ్యాధుని ఆశయాలను నేరవేరుద్దామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. బుధవారం నగరంలోని బసీ సంక్షేమ సంఘం కార్యాలయం సమీపంలో ఆర్యకటిక సంఘం అధ్యక్షుడు కృష్ణాజీరావు ఆధ్యక్షతన ధర్మవ్యాధుని జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యకటిక సంఘం కార్పొరేషన్ చైర్మన్ పదవీ కృష్ణాజీరావు ఇచ్చేందుకు ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు, సౌత్ ఇండియా ప్రెసిడెంట్ శ్రీనివాసులు, సెక్ర టరీ సత్యనారాయణ, కోశాధికారి బాలాజీ, వేంపెంట రాంబాబు పాల్గొన్నారు.

హాజ్ యాత్ర పవిత్రమైంది

కర్నూలు న్యూసిటీ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు హజ్ యాత్ర పవిత్రమైనదని జమియత్ ఉలమా రాష్ట్ర కన్వీనర్ మౌలా నా డాక్టర్ ఖాజీ అబ్దుల్ మజీద్ అన్నారు. 2025 సంవత్సరానికి సంబంధించి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల కోసం బుధవారం బుధవారపేటలోని మెరీడియన్ ఫంక్షన్ హాలులో కర్నూలు జిల్లా జమియత్ ఉలమా, యూనిక్ పాఠశాల సంయుక్త అధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికులకు మక్కా, మదీ నాలో పాటించాల్సిన నియమాలను బోధించారు. హాజి ముస్తాక్, మౌలానా ముస్తాక్ అహ్మద్, హఫీజ్ మున్వర్ సాబ్, హజ్ యాత్రికులు పాల్గొన్నారు.

కోడి పందేలకు తరలిన నాయకులు

ఓర్వకల్లు జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా విశాఖపట్నంలోని భీమవరంలో జరుగుతున్న కోడి పందే లకు మూడు రోజుల క్రితం మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివెళ్లారు. మండలంలోని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, పాలకొలను టీడీపీ సీనియర్ నాయకులు చదువుల సుధాకర్ రెడ్డి, పుసులూరు ప్రభాకర్ రెడ్డి, హుశేనాపురం గ్రామం చెందిన వైసీపీ నాయకులు పాల మధుమోహన్ తరలివెళ్లారు. మండలంలోని పాలకొలను, గుట్టపాడు, ఓర్వకల్లు, నన్నూరు, హుశేనాపురం, తిప్పాయపల్లె తదితర గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివెళ్లి కోడి పందేలను తిలకించారు.


కోడి పందేల్లో నాయకులు

పప్పుశనగకు వాన దెబ్బ

● దిగుబడి రాని వైనం ● ఆందోళనలో రైతులు

ఓర్వకల్లు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): అసలే తెగుళ్లతో అప్ర మత్తమవుతున్న పప్పుశనగ రైతులను గతంలో కురిసిన అకాల వర్షం తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. దీంతో పైరుపై బూజు, ఎండుతెగుళ్ల సోకడంతో వందల ఎకరాల్లో పంట దెబ్బతింది. మండలంలో 4,500 ఎకరాల్లో పప్పుశనగ పంటను సాగు చేశారు. వీటిలో సుమారు పంట ఎండిపోవడమే కాకుండా చెట్లు కూడా కుళ్లిపోవడంతో పంట దెబ్బతింది. మండలంలోని ఓర్వకల్లు, కన్నమ డకల, పూడిచెర్ల, నన్నూరు, ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, ఉప్పలపాడు, ఎన్.కొంతలపాడు, గుట్టపాడు, హుశేనాపురం తదితర గ్రామాల్లో పప్పుశనగ పంటను సాగు చేశారు. గత ఏడాది ఎకరాకు 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం వర్షం దెబ్బతో ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే కష్టముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పూత దశలోనే వర్షం దెబ్బ: శనగ పంట ఎదుగుదలకు ఎండ ఎక్కువగా ఉండాలి. అయితే.. ప్రతిరోజు ఆకాశం మబ్బులతో నిండి ఉంటుంది. దీంతో పంట తెగుళ్ల ఉధృతి పెరిగింది. నీటి శాతం ఎక్కువ కావడంతో పంట అక్కడక్కడ కుళ్లిపోయింది. పంట పూత దశలో ఉండి బుడ్డలు వచ్చే సమయంలో అకాల వర్షం పడటంతో పూతరాలి పోయిందని రైతులు వాపోతున్నారు. కానీ పంటపై చేసిన పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రైతులు సాగు చేసిన పప్పు శనగ పంట ఇదే

పంట మొత్తం దెబ్బతిన్నది



ఈ ఏడాది వర్షం బాగా పడింది. పంటలు కూడా బాగా పండుతాయని అనుకున్న సమయంలో వర్షం మా ఆశలపై నీరు పోసింది. నేను ఐదెకరాల్లో పప్పు శనగ పంట సాగు చేశాను. ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి పెట్టి నష్టపోయా. బుడ్డలు పడే సమయంలో వర్షం పడటంతో నాసిరకంగా తయారయ్యే అవకాశం ఉంది.

- బత్తుల వెంకటరమణ కౌలు రైతు, ఓర్వకల్లు

రైతులను ఆదుకోవాలి



పప్పు శనగ పంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉందని తెగుళ్లు రాకుండా రైతులు క్రిమిసంహారక మందులు పిచికారి చేశారు. కానీ వర్షం దెబ్బతో పంటంతా నాశనమైంది. ఎండలు లేక పంట తెగుళ్ల బారిన పడి రైతులు నష్టపోతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా దక్కే అవకాశం లేదు. ప్రభుత్వం స్పందించి శనగ రైతులను ఆదుకోవాలి.

- మోహన్ రెడ్డి, రైతు, గుట్టపాడు

ఘనంగా రామిరెడ్డితాత ఆరాధనోత్సవం

కల్లూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కల్లూరులో వెలసిన అవ దూత రామిరెడ్డితాత 32వ ఆరాధనోత్సవాలను ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 1993 జనవరి 15న సంక్రాంతి కనుమ రోజు మహాసమాధి అయిన రామిరెడ్డితాత ఆరాధానోత్సవం వైభవంగా జరిగింది. బుధవారం ప్రధాన అర్చకుల సమక్షంలో మేలుకొలుపు, సుప్రభాతం, పంచామృతభిషేకం, అర్చన, మహా మంగళహారతి, రామిరెడ్డితాత సహస్ర శతనమావళి కార్యక్ర మానికి భక్తులు పెద్దఎత్తున హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. కల్లూరు వీధుల్లో స్వామివారి పల్లకీసేవ, నందికోలా సేవా, చెక్కభజన, శోభాయాత్ర అనంతరం దాసరి రామచంద్రారెడ్డి, గ్రామ పెద్దల సమక్షంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● రామిరెడ్డితాత కాంస్య విగ్రహ శోభాయాత్ర, నందికోలా సేవలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్వీ.రామకృష్ణ, సంపతి లక్ష్మీరెడ్డి, పోలిరెడ్డి, చంద్రశేఖరప్ప తదితరులు పాల్గొన్నారు.



నందికోల సేవలో పాల్గొన్న ఎంపీ బైరెడ్డి శబరి, పల్లకి మోస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

అలాగే నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి శ్రీరామిరెడ్డి తాత ఆరాధనోత్సవంలో పాల్గొన్నారు. కల్లూరులోని స్వామివారి ఆల యంలో పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎం.నరసింహులు, సానా శ్రీనివాసులు, రంగప్ప, శివుడు పాల్గొన్నారు.

వైభవంగా మీరాషావలి కిస్తీలు


కిస్తీలకు హాజరైన భక్తులు

ఓర్వకల్లు జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపు రం గ్రామంలో వెలసిన మీరాషావలి నాసర్ షరీఫ్ ఉరుసు ఉత్సవాలు సందర్భంగా బుధవారం కిస్తీలు వైభవంగా జరిగాయి. మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారికి కాయక ర్వూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాబూసుబానీ దర్గా నుంచి మీరాషావలి దర్గా వరకు గంధాన్ని తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు షరీఫ్, సాధిక్, అక్బర్‌బాషా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం


పట్టుబడ్డ మద్యం సీసాలతో ఎక్సైజ్ సిబ్బంది

కర్నూలు అర్బన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని కల్లూరు ఎస్టేట్ పరిధిలోని చలపతి నగర్‌లో బుధవారం బోయ రమణమ్మ అనే మహిళ నుంచి తెలంగాణకు చెందిన 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. అలాగే బంగారు పేటలో సోదాలు చేయగా నీలిషికారీ శాంతమ్మ వద్ద 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామని, ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎస్‌ఐలు రెహనా బేగం, కే.నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

గూడూరు, జనవరి 15(ఆంధ్రజోతి): సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మండలంలోని కె నాగలాపురం గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమ తులను ప్రదానం చేశారు. మంగళవారం కె నాగలాపురం గ్రామం లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కె నాగలాపురం ఎస్ఐ ఆశా లత పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మొదటి, రెండో మూడో విజేతలకు ఎస్ఐ ఆశలత, సర్పంచ్ జె నయోమి, పంచాయతీ కార్యదర్శి సౌంద ర్య, సుంకన్న, గోపాల్ రెడ్డిలు బహుమ తులను అందజేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారందరికీ టీడీపీ నాయ కుడు తిరుపాల్ జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జె సురేష్ మాట్లాడుతూ ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఎంజీబీ వారియర్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. మంగళవారం గూడూరులోని శ్రీరాముల వారి ఆలయం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు టీడీపీ సీనియర్ నాయ కుడు రాజారెడ్డి, కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్, చెట్టుకింది సురేష్, రాముడు, సోమన్నలు బహుమ తులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెట్టుకింది నారాయణ, సంఘాల మధు, మూలగేరి లక్ష్మన్న, ఎంజీబీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలి: టీజీ వెంకటేశ్

కర్నూలు (కల్చరల్): మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. మంగళవారం వాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో నగరంలోని వెంకటరమణ కాలనీలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వ రస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలలో పాల్గొన్న టీజీ వెంకటేష్ సంక్రాంతి పండుగను ఇలా సమష్టిగా నిర్వహించడం స్ఫూర్తిదాయమని తెలిపారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం, వాసవీ సేవాదళ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, ఉయ్యాలవాడ, హుశేనాపురం, సోమయాజులపల్లె తదితర గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గత మూడు రోజులుగా భోగి, సంక్రాంతి, కనుమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే కేతవరం, ఓర్వకల్లులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు దాతలు బహుమతులు అందజే శారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: సంక్రాంతి పండుగ వాతావరణం కలకాలం కొనసాగాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల అన్నారు. నగరంలోని స్థానిక ఇందిరాగాంధీ నగర్‌లో డీవై ఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, ప్రజానాట్యమండలి అధ్వర్యం లో మంగళవారం ముగ్గులు, డాన్స్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్ర మంలో కుమారి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాక్రిష్ణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కే.అరుణ, మాజీ కార్పొరేటర్ రాముడు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. నూతన దుస్తులు ధరించి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. గోరంట్ల లక్ష్మీమాధవస్వామి ఆలయంలో గోదాదేవి, మాధవస్వామి కల్యాణమూర్తులను మేళతాళాలతో హంద్రీనదికి తీసుకెళ్లి చక్రస్నానం నిర్వహించారు. దీంతో ధనుర్మాస వేడుకలు ముగిశాయి.

కల్లూరు: సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని కల్లూరు అర్బన్ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో 34వ వార్డులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిం చారు. బుధవారం జిల్లా టీడీపీ కోశాధికారి, క్లస్టర్ ఇన్‌చార్జి పీయూ.మాదన్న అధ్యక్షతన నిర్వహించిన ముగ్గుల పోటీలకు కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి ముఖ్య అతిథిగా హజరయ్యారు. నిర్మల్‌నగర్ మసీదు రోడ్డులో నిర్వహించిన పోటీలకు దాదాపు 250 మంది మహిళలు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేతలకు మొదటి బహుమతి ఫ్రిడ్జ్, రెండో బహుమతి వాషింగ్‌మిషన్, మూడో బహుమతి కుట్టుమిషన్, నాలుగో బహుమతి గ్రైండర్, ఐదో బహుమతి మిక్సీలను పెరుగు పురుషోత్తం రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, జే.గంగాధర్‌గౌడ్ టీడీపీ 16 వార్డుల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

● మండలంలోని ఆయా గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఉలిందకొండ గ్రామంలో టీడీపీ నాయకుడు ఈవీ.రమణ ఆధ్వర్యంలో క్రికెట్, ఎద్దుల గిరకబండ్ల, ముగ్గుల పోటీలు నిర్వహించారు. క్రికెట్‌లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతిగా రూ.10,116, రెండో బహుమతిగా రూ.5116, గిరకబండ్ల పోటీల్లో గెలుపొందిన రైతులకు 5, 3 తూలాల వెండి బహుమతులను ఈవీ రమణ కుటుంబ సభ్యులు అందజేశారు. మహిళల ముగ్గుల పోటీలు అందరినీ ఆక ట్టుకున్నాయి. భారతి, వెంకటేశ్వరి, రాములమ్మ జడ్జిలుగా వ్యవ హరించి విజేతలను ప్రకటించారు. టీడీపీ నాయకుడు ఈవీ రమణ, నాగప్ప, వెంకటమ్మ చేతుల మీదుగా మొదటి విజేతకు వాషింగ్ మిషన్, రెండో బహుమతి కూలర్, మూడో బహుమతి సూట్‌కేసు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ధనుంజయ, ఈశ్వర్, శ్రీకాంత్, వెంకట రమణ, విక్రమ్ పాల్గొన్నారు.





విజేతలకు బహుమతులు అందజేస్తున్న పెరుగు పురుషోత్తంరెడ్డి, ఉలిందకొండలో.. గోరంట్లలో లక్ష్మీమాధవస్వామికి చక్రస్నానం


సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్


గూడూరులో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం



ఇందిరాగాంధీ నగర్‌లో..

గోజాతిని సంరక్షించాలి

గోదా గోకులంలో అష్టాక్షరీ పీఠాధిపతి


గోదా గోకులంలో పూజలు చేస్తున్న సంపత్కుమార జీయర్ స్వామీజీ

కర్నూలు(కల్చరల్), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గోజాతి ని సంరక్షించాలని సంరక్షణ, గోవుల సంతతి వృద్ధితోనే లోకం సుభి క్షంగా ఉంటుందని అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి శ్రీమన్నారాయణ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ ఉద్బోధించారు. బుధవారం కనుమ పండుగను పురస్కరించుకుని టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కర్నూలు నగర శివారులో గోదా గోకులంలోని గోదా రంగనాథ స్వామి దేవస్థానంలో గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఆయన తన శిష్య బృందంతో గోకుల క్షేత్రంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రిదండి బృందావన రామానుజ జీయరు స్వామి త్రిదండి శఠగోపముని రామానుజ జీయర్ స్వామి, గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, అర్చకులు రమేష్ భట్టార్, ఎం.రాంభూపాల్ రెడ్డి, మాకం శ్రీనివాసులు, రాధాకృష్ణ, పీవీ సుబ్రహ్మణ్యం, పాలాది సుబ్రహ్మణ్యం, వేముల జనార్దన్, పేరుమాళ్ల బాల సుధాకర్, బచ్చు నాగ సురేష్, వేముల ఎల్లయ్య, భక్తులు పాల్గొన్నారు. కనుమ పండుగ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మిడుతూరులోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానంలో గోపూజతోపాటు గో విశిష్టతపై ధార్మిక ప్రవచనాలు నిర్వహించినట్లు టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు.

నేడు పుస్తకావిష్కరణ

కర్నూలు(కల్చరల్), జనవరి 15(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన యువకవి చౌశా రాసిన బిసాన్ ఓఫ్ డా (గాజా కవిత్వం) పుస్తకం ఆవిష్కరణ సభ నగరంలోని పాతబస్టాండు సమీపంలో గల హోటల్ బావర్చి సమావేశ హాల్లో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త కవి కెంగార మోహన్ బుధవారం తెలిపారు. మహా ప్రస్థానం మరో ప్రస్థానం సమూహం సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు అధ్యక్షుడిగా మహ్మద్ మియా, పుస్తకం సమీక్ష కథా రచయిత ఇనాయతుల్లా పుస్తక ఆవిష్కరణ డా. మన్సూర్ రెహిమాన్ చేస్తారని తెలిపారు. తొలి కాపీ సామాజిక కార్యకర్త పి. ఇక్బాల్ హుశేన్ స్వీకరిస్తారని, ఆత్మీయ సందేహం సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు ఇస్తారన్నారు. అలాగే గురువారం సాయంత్రం 5 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో జర్నలిజం ధృవతార మానికొండ చలపతి రావు పుస్తకం ఆవిష్కరణ ఉంటుందని సాహితి స్రవంతీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల బసప్ప, చక్రపాణి యాదవ్ తెలిపారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర్ కల్కూర పుస్తకం ఆవిష్కరిస్తారని తెలిపారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, న్యాయవాది సి.నాగేంద్రనాథ్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, సీనియర్ జర్నలిస్టులు జి.గోరంట్లప్ప, ది ఫెడరల్ ఆంగ్ల పత్రికా ప్రధాన సంపాదకుడు జింకా నాగరాజు పాల్గొంటారని తెలిపారు.

ముగిసిన కబడ్డీ పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న టీడీపీ నాయకుడు

ఓర్వకల్లు జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనా పురం గ్రామంలో మీరాషావలి నాసర్ షరీఫ్ ఉరుసు సందర్భంగా దాతల సహకారంతో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీలకు 14 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను ఎస్ఐ సునీల్ కుమార్ ప్రారంభించారు. క్రీడాకారులను టీడీపీ నాయకులు పరిచయం చేసుకున్నారు. విజేతలకు మొదటి నుంచి వరుసగా ఐదు బహుమతులు రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదును దాతలు శ్రీనివాసులు, గువ్వరవి, జీకే సుధాకర్, మహబూబ్ బాషా, వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ పోటీలకు ఆర్గనైజర్లుగా రామదాసు, భూపతిరావు, బజారు, గొల్ల నాగరాజు, రవికుమార్ వ్యవహరించారు. క్రీడాకారులకు వడ్డె వెంకట సుబ్బయ్య అన్నదానం చేశారు. ఎస్ఐ సునీల్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కబడ్డీ విజేత నునుసురాళ్ల

పత్తికొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మండలంలోని దూదేకొండలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో నునుసురాళ్ల జట్టు విజేతగా నిలిచింది. ఎమ్మెల్యే శ్యాంబాబు టోర్నమెంట్ పేరిట నిర్వహించిన ఈపోటీల్లో విజేతకు రూ.10,016, రన్నర్స్ దేవరబండ టీం రూ 5,016 ఇవ్వంగా మూడో స్థానంలో నిలిచిన పత్తికొండ జట్టుకు రూ 3,016 ఇచ్చినట్లు నిర్వాహక కమిటీ సభ్యుడు తిరుమలేష్ గౌడ్ తెలిపారు.

స్వర్ణామృతం పంపిణీ



ఔషధాన్ని పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

ఆదోనిటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆవోపా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వికాస తరంగిణి సహకారంతో రోగ నిరోధక శక్తి కలిగిన స్వర్ణామృత ఔషధాన్ని పంపిణీ చేసినట్లు సంస్థ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా పేర్కొన్నారు. పట్టణంలో ఏడోసారి దీన్ని పంపిణీ చేశామని, ఇది మేధోశక్తిని పెంచడంతోపాటు, చర్మరక్షణ, జ్ఞాపకశక్తి పెంచుతుందన్నారు. ఈ మందును కాకుబాల్ నగేష్ సౌజన్యంతో పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు, ప్రతాప్ రన్న శెట్టి, యాదగిరి వెంకటేశ్వర్లు, రాజేష్, మహిళా విభాగం సభ్యులు వంకదారు మమతశ్రీ, శ్రీదేవి, సంతోషి, తులసి, అనీత, రాణి పాల్గొన్నారు.

కబడ్డీ, ముగ్గుల పోటీలు



బహుమతి ప్రదానం చేస్తున్న టీడీపీ నాయకులు

పత్తికొండ టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూదేకొండలో సంక్రాతి సందర్భంగా కబడ్డీ, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఎమ్మెల్యే శ్యాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.10,016, రెండో బహుమతి రూ.5,016, మూడో బహుమతి రూ.3,016ను టీడీపీ నాయకుడు తిరుమలేష్‌గౌడ్ అందజేశారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు సీపీఐ నాయకుడు రామచంద్రయ్య, ఎస్టీయూ నాయకుడు సత్యనారాయణ బహుమతి ప్రదానం చేశారు.

బాలయేసు పుణ్యక్షేత్ర మహోత్సవాలు



ప్రార్థనలు చేస్తున్న బిషప్ గోరంట్ల జ్వాన్నేషు

మద్దికెర, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మెయిన్ బజారు ఆర్సీఎం చర్చిలో బాలయేసు మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. బిషప్ గోరంట్ల జ్వాన్నేషు, ఈసీడీ ఉత్సవాలు వైభవంగా నిర్వహించినందుకు అభినందించారు. మధ్యాహ్నం దివంగత భైరెడ్డి శౌరయ్య, సుశీలమ్మ దంపతుల కుమారుడు భైరెడ్డి ఆనంద్, అనురాధ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మత గురువులు అంథోని జేవీఆర్ పాల్గొన్నారు.

స్నేహితుడికి అండగా..



మిత్రుడు లక్ష్మణ్ణతో మిత్రులు

పత్తికొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌తో మంచానికే పరిమితమైన స్నేహితునికి మిత్రులు అండగా నిలిచారు. పత్తికొండ మండలం హోసూరు గ్రామానికి చెందిన లక్ష్మణ్ణ రేషన్ డీలర్‌గా పనిచేస్తూ, రెండునెలల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మంచానికే పరిమితం అయ్యాడు. స్నేహితుడి పరిస్థితిని తెలుసుకున్న ప్రభుత్వ బాలుర పాఠశాల 1988-1989 పదో తరగతి విద్యార్థులు రూ.50వేల ఆర్థిక సాయం అందించారు.

డాక్టర్ ఉమాదేవికి పురస్కారం



ఆదోని అగ్రికల్చర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకురాలు, రచయిత్రి డాక్టర్ బల్లారి ఉమాదేవికి కళావేదిక సంస్థ కీర్తి పురస్కారాన్ని అందజేయనుంది. వివరాల మేరకు.. సంస్థ ప్రతినిధి కత్తి మందా ప్రతాప్ ఈనెల 21న విజయవాడలో ఆమెకు అందజేయనున్నారు. తెలుగు భాష సంస్కృతి తెలుగు వైభవం, సాహిత్యం, కళలు, తెలుగు పరిరక్షణకు ఆమె సేవలకు గుర్తింపుగా ఇవ్వనున్నారు.

టీడీపీ నాయకుడి మృతి



వెంకట్రాముడు (ఫైల్)

మద్దికెర, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు పారా వెంకట్రాముడు (65) బుధవారం మృతి చెందాడు. అనారోగ్యంతో నెల రోజులుగా వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచినట్లు బంధువులు తెలిపారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు జమేదార్ రాజన్న యాదవ్, టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, ఎన్.లక్ష్మినారాయణ, చంద్రశేఖర్‌గౌడు, గడ్డం రామాంజులు తదితరులు మృతదేహానికి నివాళి అర్పించారు.

వైభవంగా రథోత్సవం

- పాల్గొన్న ఇరు రాష్ట్రాల భక్తులు
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు



రామలింగేశ్వర మహా రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



స్వామివారిని తీసుకొస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



రథోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేలు, నాయకులు





కళాకారుల ప్రదర్శన

మంత్రాలయం జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయి ద్యాలు, భక్తుల హర్షధ్వానాల మధ్య రాంపురం రామలింగేశ్వర స్వామి మహా రథోత్సవం వైభవంగా సాగింది. బుధవారం మంత్రాలయం మండలం లోని రాంపురం గ్రామంలో తుంగభద్ర నది ఒడ్డున నిర్వహించారు. రామలింగేశ్వర ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, విరూపాక్షి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి, అనంతపురం మాజీ ఎంపీ వెంకట్రామిరెడ్డి, కర్నూలు మాజీ ఎమ్మెల్యే వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. రథానికి నందికోల నృత్యాలు, కోలాటాలు, ప్రత్యేక నృత్యాల వేషాధారణలు, బొమ్మల ప్రదర్శనలు మంగళవాయిద్యాలు, టీరప్పడోళ్లు, తప్పెట్లతో స్వాగతం పలికారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సీఐలు రామాంజులు, మంజునాథ్, అశోక్, ఎస్ఐలు విజయకుమార్, పరమేష్ నాయక్ ఆధ్వర్యంలో 110 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గురెడ్డి భీమిరెడ్డి, బాబురెడ్డి, మురళీ దర్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి



పత్తికొండలో ఆకట్టుకున్న ముగ్గు

పత్తికొండ టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. అలాగే పలు ఆలయాలకు వెళ్లి నైవేద్యాలు సమర్పించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

మద్దికెర, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో మకర సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమ, మంగళ, బుధ వారాల్లో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను వైభవంగా జరుపుకు న్నారు. సంక్రాంతి భాగంగా గ్రామాల్లో ముగ్గుల పోటీలు, భజన పోటీలు నిర్వహించారు. పెరవలి గ్రామంలో పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు. అలాగే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కనుమ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

సంక్రాంతి వేడుకలు

తుగ్గలి: మండలంలో సంక్రాంతిని వైభవంగా నిర్వహించుకున్నారు. మంగ, బుధవారం గ్రామాల్లో సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా మహిళలు ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆలూరు: సంక్రాంతి పండుగను ఆలూరులో సంతోషంతో చేసుకున్నారు. బాధవారం కనుమ సందర్భంగా గ్రామాల్లో ఎడ్లపందేలు నిర్వహించారు.

కబడ్డీ విజేత బల్లేకల్



ట్రోఫీని ప్రదానం చేస్తున్న సర్పంచ్

ఆస్పరి,జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి కబడ్డీ విజేతగా బల్లేకల్ జట్టు విజయం సాధించింది. పోటీలను ఆస్పరి యూత్ సేవా సమితి నిర్వహించింది. 20 జట్లు పాల్గొనగా బుధవారం ఫైనల్‌లో బల్లేకల్, నాగనాతనహళ్లి జట్లు తలపడ్డాయి. విజేతకు ఆస్పరి సర్పంచు మూలింటి రాధమ్మ, కేడీసీసీ మాజీ డైరక్టర్ రాఘవేంద్ర రూ.20,116, రన్నర్స్‌కు ఆస్పరి సేవా సమితి యూత్ సభ్యులు రామకృష్ణ, అరవింద్, మహేష్, నరసప్ప, నరసింహులు, హేమంత్ రూ.10,116లు ఇచ్చారు. అలాగే మూడో స్థానంలో నిలిచిన కైరుప్పల జట్టుకు టీడీపీ నాయకుడు మేకల రంగన్న రూ.5,116లు అందజేశారు.

విజేతగా యశ్వంత్ జట్టు

వెల్దుర్తి/టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా బొమ్మన శివశంకర్ రెడ్డి, జ్ఞాపకార్థం నిర్వహించిన సూపర్ 8 క్రికెట్ టోర్నమెంటులో వెల్దుర్తికి చెందిన యశ్వంత్ ఎలెవెన్ జట్టు విజేతగా నిలిచింది. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విజేతగా నిలిచిన యశ్వంత్ ఎలెవెన్ జట్టుకు టీడీపీ మండల అధ్యక్షులు బలరాంగౌడు రూ.10,116 నగదు బహుమతి అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన ఐజీ నగర్ కింగ్స్ (వెల్దుర్తి) జట్టుకు రామళ్లకోట రామకృష్ణ ఆచారి రూ.5,116, మూడో సాధనంలో నిలిచి జట్టుకు హెడ్ కానిస్టేబుల్ రాముడు రూ..3,016లులు నగదు అందజేశారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నమెంట్

ఆదోని అగ్రికల్చర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ మైదానంలో నిర్వహిస్తున్న ఆదోని చాంపియన్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. బుధవారం సాంబగల్లు ఘాజీ 11 జట్టుపై కల్లుబావి కింగ్స్ 11 జట్టు రెండు వికెట్ల నష్టానికి 68పరుగుల తేడాతో విజయం సాధించింది. 16బంతుల్లో 32పరుగులు సాధించిన సూర్య 21 బంతుల్లో 30 పరుగులు చేసిన భరత్‌కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను మాల మహానాడు జైభీమ్ సాయిరాం, టీడీపీ నాయకుడు ఇక్బాల్ అందజేశారు. ఈనెల 19వరకు క్రీడాపోటీలు కొనసాగుతాయని నిర్వాహకుడు కెఎం ముజీబ్ తెలిపారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ఆదోని అగ్రికల్చర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు, క్రీడల్లోనూ రాణించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రామాంజనేయులు, డీవైఎఫ్ఐ మాజీ నాయకుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పర్వతాపురంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సీఐటీయూ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, వెంకటేశులు, ముని, రమేష్, మంజు, హరి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దొంగ



దొంగను మీడియాకు చూపుతున్న పోలీసులు

ఆదోని రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న దొంగ హొళగుంద మండలం మడ్డిలింగదహళ్ళి గ్రామానికి చెందిన బారికి రామన్నను ఇస్వీ పోలీసులు అరెస్టు చేశారు. గత సోమవారం సంతెకుడ్లూరు గ్రామం అరూడ సిద్ధలింగేశ్వర ఆలయంలోని విగ్రహాల నుంచి బంగారు బంగారు ఆభరణాలను దొంగలించిన కేసులో అదుపులోకి తీసుకొని విచారించగా, సంతేకుడ్లూరుతోపాటు నారాయణపురం, నాగనాథనహళ్ళి గ్రామాల ఆలయాల్లో కూడా ఆభరణాలను దొంగలించినట్లు నిందితుడు అంగీకరించినట్లు ఎస్.ఐ నాగేంద్ర తెలిపారు. 10గ్రాముల బంగారం, 5 గ్రాముల వెండి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బీజేపీ నాయకుడి మృతి

ఆదోని రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కపటి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు రవి కుమార్(30) అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా కిడ్నీ సమస్య, కడుపునొప్పితో బాధపడుతున్న రవికుమార్‌ను కర్నూలుకు తరలించారు. కోలుకోలేక బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడిరి భార్య చామంతి, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

సంప్రదాయలకు ప్రతీక..

దేవనకొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంప్రదాయాలకు ప్రతీక అని కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. దేవనకొండ, పి.కోటకొండ గ్రామాల్లో సీఐటీయూ, డీవైఎఫ్ఐ అధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు, దేవనకొండ ఏఎస్ఐ శ్రీనివాసులు, సీపీఎం నాయకుడు వీరశేఖర్ బహుమతులు ఇచ్చారు. గద్దెరాళ్ల గ్రామంలో యువకులకు పరుగుపందెం పోటీలు నిర్వహించారు.

పందెం రాయుళ్ల అరెస్టు

ఆదోని, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తున్న వారిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పట్టణంలోని రాయనగర్ సమీపంలో కోడి పందేలు ఆడుతున్నట్లు సమాచారం మేరకు సీఐ శ్రీరాములు సిబ్బందితో దాడులు నిర్వహించారు. 16 మంది నిందితులను అదుపులోకి తీసుకుని, రెండు కోడిపుంజులు, రూ.72వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ముగ్గుల పోటీలు

తుగ్గలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలింగాయపల్లెలో సీపీఐ, వ్యవసాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నబీ రసూల్ బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలు మహాలక్ష్మి, రాధమ్మ, ఝాన్సీ, వీఆర్ఏ సూర్యనారాయణ, నబీసాహెబ్, పులికొండ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలబెడదాం

- టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్



కేక్ కట్ చేస్తున్న వైకుంఠం శివప్రసాద్, జ్యోతి

ఆలూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదులో ఆలూరును అగ్రస్థానంలో నిలబెడదామని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం జ్యోతి పిలుపు నిచ్చారు. 30వేల సభ్యత్వా లు నమోదైన సందర్భంగా బుధవారం కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. నాయకులు, కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



నగదు అందజేస్తున్న పురుషోత్తం చౌదరి

మద్దికెర, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పి.పురుషోత్తం చౌదరి అన్నారు. బుధవారం పెరవలి గ్రామంలో కబడ్డీ విజేతకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించా లన్నారు. నిర్వాహకులు రంగనాథ్, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ శ్రీరాములు

కీడల్లో రాణించాలి

ఆదోని జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని వన్‌టౌన్ సీఐ శ్రీరాములు సూచించారు. బీజేవైఎం క్రికెట్‌కప్ 2025 ఫైనల్ బుధవారం నిర్వహించారు. విజేత లఫ్లీ-11జట్టుకు రూ.11,111 నగదు, ట్రోఫీని పారిశ్రామిక వేత్త విట్టా రమేష్ అందజేయగా, రన్నర్స్ రోహిత్ 11 జట్టుకు ఎంపీపీ దానమ్మ, పంపాపతి నాయుడు, మధు రూ.5,555 నగదు, ట్రోఫీని ఇచ్చారు. అలాగే తృతీయ బహుమతి ఎస్‌హెచ్11 జట్టుకు 3,333లు నగదును మహదేవ, కురువ వేణుగోపాల్ అందజేశారు. సీఐ మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలు, గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్, ప్రోగ్రాం కన్వీనర్ శివ ఎమ్మెల్యే పార్థసారథికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు జంపాల కేశవ్ చౌదరి, మునిస్వామి, నాగ రాజు గౌడ్, కౌన్సిలర్ సురేష్ పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న, సిద్ధరామేశ్వర జయంత్యుత్సవాలు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యోద్యమంలో తెలుగువారి ఉనికి చాటిన వ్యక్తి వడ్డే ఓబన్న అని రాష్ట్ర కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, అఖిల భారత వడ్డె ఓబన్న సేవా సమితి అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెద్దహరి వాణం గ్రామంలో రామేశ్వరస్వామి, వడ్డె ఓబన్న జయంతి నిర్వహించారు. తెల్లదొరల అక్రమ పన్ను వసూళ్లపై తిరుగుబాటు చేసిన ధీరశాలి ఓబన్న అని కొనియాడారు. రేనాటి వీరుడు ఉయ్యా లవాడ నరసింహా రెడ్డికి కుడి భుజంగా ఉద్యమంలో పాల్గొన్నా రని గుర్తు చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డే రామన్న, గజ్జహళ్ళి విశ్వనాథ్ రాజు, హనుమంతప్ప, మెడికల్ నాగరాజు, రామన్న, లక్ష్మన్న, దేవేంద్ర పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలుపోతున్నా పట్టించుకోరా?



జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఆలూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా అని ఎమ్మెల్యే విరుపాక్షి కాంట్రాక్టర్లపై అసహనం వ్యక్తం చేశారు. బుధవారం జాతీయ రహదారిని పరిశీలించారు. రహదారిని పూర్తి చేయకపోవడంతో వాహనచోదకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దుమ్ము, ధూళితో ప్రజలు, వ్యాపారులు అనారోగ్య పాలవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించడం లేదని మండిపడ్డారు. వీరేష్, రామలింగ, తిక్కస్వామి, రాజశేఖర్ పాల్గొన్నారు.

హనుమంతు కుటుంబానికి అండగా ఉంటాం

మర్కట్టు గ్రామ మాజీ ఎంపీటీసీ రంగమ్మభర్త హనుమంతు(47) బుధవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే విరుపాక్షి గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీటీసీ దేవరాజు, ఎల్లప్ప, అనిల్, ఓబులేష్ పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ దేవర

కోసిగి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 3వ వార్డు ఎస్సీ కాలనీలో బుధవారం కాలనీవాసులు ఘనంగా మారెమ్మ దేవర వేడుకలు జరుపుకున్నారు. కాలనీపెద్దలు భవనాసి సొట్టయ్య, సంజిపోగు మాణిక్య రాజు, దుబ్బయ్య, భవనాసి ముక్కురయ్య, అరిగి రామప్ప, పరుశురాం, సంజిపోగు జట్టాల్, ఆధ్వర్యంలో వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే మారెమ్మదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుంభాలతో డప్పు వాయిద్యాల మధ్య ఆలయం వరకు ర్యాలీగా వచ్చి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సుంకులమ్మ దేవతకు పూర్ణ కుంభాలతో ర్యాలీగా వెళ్లి నైవేద్యాలు సమర్పించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్లు, కందనాతి గ్రామాల్లో మంగళవారం దేవర ఉత్సవాలను ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆయా గ్రామాల్లో వెలసిన మారెమ్మవ్వ, బంగారమ్మవ్వలకు ఆలయ అర్చకులు జలాభిషేకం, కుంకుమార్చన, పుష్పాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించి మంగళహారతులిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని భక్తులు కుంభాలతో అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

'ఉపాధి' సొమ్ము రికవరీ చేయాలి

కోసిగి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలో ఉపాధి హామీ పథకంలో 2023-24 సంవత్సరానికి గానూ జరిగిన పనుల్లో అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై చర్యలు తీసుకుని అవినీతికి పాల్పడిన సొమ్మును రికవరీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వీరేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 17వ సామాజిక తనిఖీల్లో భాగంగా 2023-24 సంబంధించి జరిగిన పనుల్లో రూ. 11లక్షలకు పైగా అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీల్లో అధికారులు గుర్తించారన్నారు. అవినీతికి పాల్పడిన సొమ్మును రికవరీ చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అంజి, పురుషోత్తం, జాన్సన్, తదితరులున్నారు.

గోకుల షెడ్లు లాభదాయకం: ఏపీవో

నందవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గోకుల షెడ్ల ద్వారా రైతులకు లాభదాయకమని ఏపీవో శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని నదికైరవాడి, మాచాపురం గ్రామాల్లో మినీ గోకుల షెడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి కాశీం వలి, పులచింత సర్పంచ్ బండేగురుస్వామి, ఐటీడీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షుడు నదికైరవాడి కురవ వీరేష్, సత్యారెడ్డి, వీరారెడ్డి, బజారి, వలి, పేట సర్పంచ్ ఉదయ్‌కుమార్‌గౌడు, డబ్బా ఈరన్న, వీరేష్, బసప్ప, జనసేన మండల అధ్యక్షుడు యల్లప్ప పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

కోసిగి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.రాజు, మండల అధ్యక్ష కార్యదర్శులు చిన్న, జీవన్ డిమాండ్ చేశారు. బుధవారం కోసిగిలోని ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలు రైల్వే, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, ఆయిల్ గ్యాస్ కంపెనీలను ప్రైవేటీకరణ చేస్తున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యమైన నేపథ్యంలో ప్రైవేటు రంగ సంస్థలు పెరిగిపోతున్నాయన్నారు. నిరుద్యోగ సమస్యలపై చర్చించేందుకు వచ్చే నెల 6నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే 22వ రాష్ట్ర మహాసభలు వేదిక కానున్నాయన్నారు.





స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు, రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎంపీ నాగరాజు, మంత్రాలయం, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జిలు రాఘవేంద్రరెడ్డి, వీరభద్రగౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తదితరులు

చేనేతపురి శివమయం

- ఉత్సాహంగా నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ప్రముఖుల హాజరు

ఎమ్మిగనూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ ప్రజల ఆరాధ్యదైవం నీలకంఠేశ్వరస్వామి రథోత్సవంతో చేనేతపురి శివ నామస్మరణతో మారుమోగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది భక్తులతో పురవీధులన్నీ కిక్కిరిసి కనిపించాయి. ప్రజలు నీలకంఠేశ్వరస్వామి రథాన్ని లాగుతూ తమ భక్తిని చాటుకున్నారు. యువకులు కోలహలంగా జాతరలో సందడి చేశారు. పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు స్వామివారి రథోత్సవంలో పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మిగనూరు శ్రీనీలకంఠేశ్వర స్వామి మహా రథోత్సవంలో ఈ ఏడాది డ్రోన్‌తో కురిపించిన రంగు రంగుల కాగితాల వర్షం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహారథోత్సవం ప్రారంభం కాగానే ఆలయ నిర్వాహకులు ఆకాశం నుండి డ్రోన్ సహాయంతో పలుమార్లు గాలిలో ఆ చివరి నుండి ఈ చివరి వరకు తిరుగుతూ చిన్నపాటి రంగురంగుల కాగితాలను రథోత్సవంపై చల్లించారు. దీంతో భక్తులు కేరింతలు కొడుతూ హరహరమహాదేవ అంటూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

● **రథోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు..** నీలకంఠేశ్వరస్వామి రథోత్సవంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, మాజీ ఎంపీ బుట్టారేణుక, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి, రాజీవ్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.రుద్రగౌడ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నరవ రమాకాంతరెడ్డి, తెలుగుయువ జిల్లాకార్యదర్శి దివాకర్ రెడ్డి, ఎంజీ కుటుంబీకులు, టీడీపీ బీసీసెల్ కార్యదర్శి మాచాని సోమునాథ్, ఆలయ ధర్మకర్త కుటుంబ సభ్యులు మాచాని శివశంకర్, ఎంపీపీ కేశన్న, ఆదోని ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్, కమీషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ శేషఫణి, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు పర్యవేక్షణలో సీఐలు శ్రీనివాసులు, బీవీ మధుసుదన్‌రావు, ఎస్ఐలు డాక్టర్ నాయక్, కె.శ్రీనివాసుల ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

పోలీసులకు, ఎంపీపీకి మధ్య తోపులాట: ఎమ్మిగనూరు నీలకంఠేశ్వరస్వామి జాతర సందర్భంగా తేరుబజారులో రథోత్సవం దగ్గరకు వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డితో పాటు ఎమ్మిగనూరు మండల ఎంపీపీ గొల్ల కేశన్న మరికొంతమంది కార్యకర్తలు బయల్దేరి వెళ్లారు. అయితే, రథోత్సవం దగ్గరకు వెళ్లగానే వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిని మాత్రమే రథోత్సవం జరిగే ప్రాంతానికి పోలీసులు అనుమతించారు. వెనుకనే ఉన్న ఎమ్మిగనూరు మండల ఎంపీపీ గొల్ల కేశన్నను పోలీసులు అడ్డుకున్నారు. తాను ఎంపీపీ అని చెప్పినప్పటికి నీవెవరైతే మాకేంటి అంటూ వెనక్కి నెట్టడంతో ఎంపీపీ కేశన్న కిందపడ్డాడు. దీంతో పక్కన ఉన్న కార్యకర్తలు, ఎంపీపీ కేశన్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రథోత్సవం దగ్గరకు వెళ్లేందుకు అనుమతించాలని..ఎందుకు అడ్డుకుంటున్నారంటూ మండిపడ్డారు. అయితే అప్పటికే రథోత్సవం దగ్గర జనాలు ఎక్కువగా ఉన్నారని పక్క నుంచి వెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో ఓ పోలీసు అధికారి కలుగజేసుకొని ఇరువురికి సర్దిచెప్పి ఎంపీపీ కేశన్నతో పాటు ఒకరిద్దరు కార్యకర్తలను మాత్రమే లోపలికి పంపారు.



రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎంపీ బుట్టా రేణుక



స్వామివారికి నమస్కరిస్తున్న నవదంపతులు

అలరించిన భక్త చింతామణి నాటకం



చింతామణి నాటకంలో రత్నశ్రీ నృత్య ప్రదర్శన

ఎమ్మిగనూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ కళా ప్రాంగణంలో బుధవారం రాత్రి విశ్వమోహన నాటక కళ సమితి ఆధ్వర్యంలో ప్రదర్శించిన భక్త చింతామణి నాటకం నాటక ప్రేక్షకులను అలరించింది. చింతామణిగా నంది అవార్డు గ్రహీత, రాష్ట్రస్థాయి కళాకారిణి జి.రత్నశ్రీ, భవానిగా కోటేశ్వరరావు, పూల రంగడుగా హైదరాబాద్‌కు చెందిన హస్య నటుడు రోషి రెడ్డి నటన ప్రేక్షకులను అలరించారు. అలాగే నాటకానికి హార్మోనిస్టుగా కె.సత్యాబాబు, మహేశ్వర్య, రాఘవేంద్రచారి, రామలింగయ్య, నవీన్ కూమార్‌లు సంగీతాన్ని అందించగా వీరరాజు డోలర్‌గా వ్యవహరించారు. నాటక ప్రదర్శనకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి హాజరై కళాకారులను అభినందించారు. అదేవిధంగా జూనియర్ కళశాల మైదానంలో బీవీ సేనా ఆధ్వర్యంలో జబర్ధస్త్ హాస్యనటులు అలరించారు. కార్యక్రమంలో నిర్వహకులు నరసన్న గౌడ్, నవాజ్, జగదీశ్, రాజేష్, మల్లి, అంబేడ్కర్, సామెల్, రజాక్ పాల్గొన్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఎండ్ల బండ్లు




నందికోల సేవ, రథోత్సవంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి



రథోత్సవంలో గొరవయ్యల సందడి

వైభవంగా రామలింగేశ్వరుడి మహా రథోత్సవం




రథోత్సవంలో పాల్గొన్న జనం, రథం వద్ద ఎమ్మెల్యేలు, వైసీపీ నాయకులు

- పాల్గొన్న అశేష భక్తజన వాహిని
- ప్రత్యేక వాహనంపై రాంపురంరెడ్డి సోదరులు, నాయకుల ఊరేగింపు
- ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు

మంత్రాలయం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాలు, భక్తుల హర్షధ్వానాల మధ్య రాంపురం రామలింగేశ్వర స్వామి మహారథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. బుధవారం మంత్రాలయం మండలంలోని రాంపురం గ్రామంలో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వర స్వామి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రాంపురం రెడ్డి సోదరులు, ఆలయ ధర్మకర్తలు, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి, అనంతపురం మాజీ ఎంపీ వెంకట్రామిరెడ్డి, కర్నూలు మాజీ ఎమ్మెల్యే వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మంచాల సొసైటీ మాజీ అధ్యక్షులు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, భీమా యూత్ నాయకులు ధరణీధర్ రెడ్డి, భీమారెడ్డి, మనోజ్‌రెడ్డి, నైరుద్‌రెడ్డి, ఆంధ్ర, కర్ణాటక మఠాలకు చెందిన పీఠాధిపతులను ప్రత్యేక వాహనంపై ఆలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. రాంపురం రెడ్డి సోదరులు ఇంటి నుంచి ఉత్సవమూర్తి ఆలయం వరకు చేరుకుని అక్కడ పూజలు చేసి మహారథంపై ఏర్పాటు చేశారు. ఉత్సవమూర్తిని అర్చకులు తలపై పెట్టుకుని మోసుకువస్తున్న దృశ్యం ఆకట్టుకుంది. మహారథం ముందుకు సాగుతుండగా.. నందికోల నృత్యాలు, కోలాటాలు, ప్రత్యేక నృత్యాల వేషాధారణలు, బొమ్మల ప్రదర్శనలు మంగళవాయిద్యాలు, బీరప్పడోళ్లు, తప్పెట్లతో మహారథానికి స్వాగతం పలికారు. రథం ముందుకు సాగుతుండగా.. భక్తులు గోవిందా గోవిందా, హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు జయధ్వానాలు పలికారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాంపురం రెడ్డి సోదరులకు సన్మానాలు చేసేందుకు ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, గుంతకల్లు, ఉరువకొండ, రాయచూరు, మాన్వి, సింధనూరు, ఐజ, గద్వాల, నియోజకవర్గాల నుంచి వచ్చిన అభిమానులు తరలివచ్చారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రాలయం, కోసిగి, కౌతాళం సీఐ రామాంజులు, మంజునాథ్, అశోక్, మాధవరం, మంత్రాలయం ఎస్ఐలు విజయకుమార్, పరమేష్ నాయక్ ఆధ్వర్యంలో 110 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గురెడ్డి భీమిరెడ్డి, బాబురెడ్డి, మురళీధర్ రెడ్డి, వ్యవసాయ మండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి, పురుషోత్తంరెడ్డి, కృష్ణారెడ్డి, మంత్రాలయం తహసీల్దార్ ఎస్.రవి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య , ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు భక్తులు పాల్గొన్నారు.



నందికోల నృత్యం చేస్తున్న అర్చకులు

అలరించిన నందికోల నృత్యాలు: రాంపురం జాతరలో సందర్భంగా బుధవారం రాత్రి కర్నూలుకు చెందిన ఎస్కే బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో భీమవరానికి చెందిన కవిత, నృత్య కళాకారులు కర్ణాటక చెందిన గాయనీ లత చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి, మిమిక్రీ, ఉర్రూతలూగించే జానపద నృత్యాలు భక్తులను అలరించాయి. అలాగే నందికోల, వీరభద్రుని వేషధారణలో భక్తుల నృత్యాలు, భీరప్పడ్రోళ్లు, ఆంజనేయుడు, పరమేశ్వరుని వేషాధారణలు, మహిళల కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి.

● **రాంపురం సోదరులకు, నాయకులకు స్వాగతం :** శ్రీరామలింగేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా రాంపురంరెడ్డి సోదరులకు జడ్పీటీసీ గోవిందమ్మ, ఎంపీటీసీలు మజ్జిగ నరసమ్మ, జయలక్ష్మి, సర్పంచ్ మేకల సుజాత ఆధ్వర్యంలో భారీ గజమాల వేసి పూలవర్షం కురిపించారు. రోగెప్ప, బొజ్జప్ప, రవిరెడ్డి, వెంకోబ, జెట్టి వీరేష్ బృందం చేసిన గజమాల భక్తులను ఆకట్టుకుంది.





ఉత్సవమూర్తిని మోసుకుని వస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వీరభద్రుని వేషధారణలో కళాకారుడు, ఈశ్వరుడు, ఆంజనేయస్వామి అలంకరణలో..

క్రీడలకు ప్రోత్సాహం అందిస్తా: ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో క్రీడలకు, క్రీడాకారులకు తన వంతు ప్రోత్సాహకాన్ని అందిస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్, వాలీబాల్ టోర్నమెంట్లను ఎమ్మెల్యే బీవీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు క్రీడలకు పుట్టినిల్లు అని, ఎంతో మంది క్రీడాకారులు ఇక్కడ క్రీడల నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ రామకృష్ణ, సీజీ ఈరన్న, విజేత నాగరాజు, బందె నవాజ్, ఉరుకుందయ్యశెట్టి, కోచ్ మాబు, సీఐ శ్రీనివాసులు, ఎస్సై, నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత బుల్స్ బుల్లెట్: నలభై రోజులుగా బీవీ స్మారక క్రికెట్ టోర్నమెంట్ స్థానిక వీవర్స్‌కాలనీ మైదానంలో నిర్వహిస్తుండగా బుధవారం ఫైనల్ మ్యాచ్‌లో బుల్స్ బుల్లెట్, స్టార్ లెవెన్ జట్లు పోటీ పడగా టాస్ గెలిచిన బుల్స్‌బుల్లెట్ మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 12ఓవర్లలో 148 పరుగులు చేయగా స్టార్ లెవెన్ 110 పరుగులకు ఆలౌట్ అయింది. బుల్స్‌బుల్లెట్ విజేతగా నిలిచింది. విన్నర్స్‌కు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ట్రోఫీతో పాటు రూ2,00,016 నగదు ప్రదానం చేయగా, రన్నర్స్‌కు రూ 1,00,000 అందజేశారు. కామెంటరీ చేసిన రంజిత్‌ను ఎమ్మెల్యే మెచ్చుకున్నారు. ఫైనల్ మ్యాచ్‌ను ఆసక్తిగా ఎమ్మెల్యే, అప్పా బజార్ శేఖర్, టీడీపీ నాయకులు వీక్షించారు. ఆర్గనైజర్స్ రంగస్వామి గౌడ్, నర్సన్నగౌడ్, బీమేష్, సురేష్ చౌదరిలను అభినందించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, సీఐ శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

ఘనంగా సంక్రాంతి సంబరాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రామ పెద్దలు

పెద్దకడుబూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దకడుబూరుతోపాటు, దొడ్డిమేకల, హెచ్.మురవణి, నౌలేకల్లు, రాగిమాన్‌దొడ్డి, కల్లుకుంట తదితర గ్రామాల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

మంత్రాలయం: మంత్రాలయం రాఘవేంద్రస్వామి సన్నిధానంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవరాయలకు మహాపూజ, మూలరాములకు అభిషేకం నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది.

కౌతాళం: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని బదినేహల్ గ్రామంలో మల్లికార్జునస్వామి దేవాలయంలో గ్రామ మహిళలకు గ్రామ పెద్దలు ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు గ్రామ పెద్దల బహుమతులను అందజేశారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు.

గోనెగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని చింతలాముని నల్లారెడ్డి స్వామి, ఈశ్వరదేవాలయం, సీతారామాంజినేయ స్వామి దేవాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. సంక్రాంతి పురుషుడి లక్షణాలను ఈశ్వరదేవాలయంలో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య స్వామి ప్రజలకు వివరించారు.

విజేతలకు బహుమతులు ప్రదానం: సంక్రాంతి సందర్భంగా చింతలాముని నల్లారెడ్డి దేవాలయం ప్రాంగణం నందు దేవాలయ కమిటీ అధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలలో విజేతలకు దేవాలయ అర్చకులు, గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి బహుమతులను ప్రదానం చేశారు. అలాగే అలువాల గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గులపోటీలు నిర్వహించారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందాడు. ఈఘటన ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్లు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు కడివెళ్ల గ్రామానికి చెందిన మంగమ్మ, పెద్దయ్యల మొదటి కుమారుడు రవి(14) అమ్మమ్మ వారి ఊరైన గుడికల్లులో జరిగే దేవర ఉత్సవానికి వచ్చాడు. తోటి పిల్లలతో కలిసి గ్రామం పక్కలో ఉన్న ఎల్లెల్సీ కాలువలో ఈతకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోగా ఎంతటికి బయటకు రాకపోవడంతో తోటిపిల్లలు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. అయితే చాలాసేపటికి రవి మృతి చెంది నీటిలో తేలడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని బయటకు తీశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రకోట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి స్వల్పగాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కర్నూలుకు చెందిన షేక్షావలి ద్విచక్ర వాహనంపై భార్యతో కలిసి ఎమ్మిగనూరులో జరిగే నీలకంఠేశ్వర స్వామి రథత్సవానికి బయల్దేరాడు. అయితే ఎర్రకోట సమీపానికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో షేక్షావలితో పాటు ఆయన భార్య ఆటోలో ఉన్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బందికి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అదుపు తప్పిన కారు

గోనెగండ్ల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల గ్రామ బాట మారెమ్మ అవ్వ దేవాలయం సమీపంలో బుధవారం ఉదయం మంత్రాలయం నుంచి వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఎల్లెల్సీ కాలువలోకి దూసుకుపోయింది. అయితే డ్రైవర్ చాకచక్యంతో కారువేగాన్ని అదుపు చేయడంతో కారులో ఒకే కుటుంబానికి చెందిన పది మందికి త్రుటిలో ప్రమాదం తప్పింది. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన అనంత రంగారెడ్డి అనే వ్యక్తి తన కుటుంబసభ్యులతో కలసి మంత్రాలయానికి వెళ్లి స్వావారిని దర్శించుకున్నారు. అనంతరం యాగంటి క్షేత్రాన్నికి బయలుదేరారు. బుధవారం ఉదయం గోనెగండ్ల బాట మారెమ్మ అవ్వ దేవాలయం సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న ఎల్లెల్సీ కాలువలోకి దూసుకువెళ్లింది. అయితే డ్రైవర్ వేగాన్ని అదుపు చేయడంతో కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.